క్లుప్తంగా

దివ్యాంగుల బడిబాటకు ప్రత్యేక సర్వే



సర్వేను నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు

గాలివీడు : దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర, జిల్లా సంచాలకుల ఆదేశాలనుసారం ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఐఈఆర్పీలు ఖలందర్, కృష్ణవేణిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి సర్వేను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జూన్ 9 వరకు సాగే ఈ సర్వే మండల విద్యాధికారులు నాగరాజు, శ్రీనివాసులు పర్యవేక్షణలో సాగుతుందన్నారు. ఈ సర్వేలో భాగంగా చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి చదువు వలన కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించినట్లు చెప్పారు. పిల్లల భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఓబులవారిపల్లె : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, మంచి పుస్తకాలు చదవడం వలన జ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ నిర్వాహకులు అష్రఫ్ అలీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవులు సందర్భంగా గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని, ఇందులో పుస్తకాలు చదవడం, క్యారం బోర్డు, చెస్, జూడో వంటి క్రీడలు నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జూన్ 7వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న అమీరుద్దీన్

రామాపురం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి కడప జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులకు ప్రత్యేకమన్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు పాఠశాలల సెలవుల్లో ఈ శిబిరాలు ఉంటాయన్నారు. విద్యార్థులు సమయం వృథా చేయకుండా ఉండేందుకు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సూర్యనారాయణరెడ్డి, విద్యార్థులు ఉన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

రామాపురం : వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని మండల ఎస్‌ఐ వి.ఎల్.ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగాయన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. వాహనం నడిపేటప్పుడు వాహనానికి సంబంధించిన రికార్డులను, లైసెన్సులను అందుబాటులో ఉండాలన్నారు. అధికారుల తనిఖీలు చేసేటప్పుడు వాహనదారులు సహకరించాలని తెలియజేశారు. సమావేశంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్ శర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద ఓ అనాథ వృద్ధుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సీహెచ్ రమేష్‌లు తమ సహచరులతో అక్కడికి చేరుకొని మంగళవారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అనాథులను ఆదుకోవడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగానే గుర్తు తెలియని వారు మృతి చెందినప్పుడు వారికి అంత్యక్రియలు సనాతన సాంప్రదాయ పద్ధతిలో జరుపుతుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సుబ్బారాయుడు, పురుషోత్తం, పంచాయతీ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సెలవుల కాలం.. జరభద్రం

- పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి
- నదులు, చెరువుల వద్దకు వెళ్లనీయకండి
- షికారుకు వెళితే సూచనలు చేయాల్సిందే
- ఊర్లకు వెళ్లే కుటుంబాలు జాగ్రత్తలు తప్పనిసరి



బావిలో ఈత కొడుతున్న పిల్లలు



మైదానంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

రాజంపేట : బడులన్నీ నిశ్శబ్దమైపోయి సందడంతా ఇంటి గడపలకు చేరింది. సెలవు రోజుల్లో బోలెడు ప్రణాళికలు పెట్టుకుంటారు. అయితే సరదా గడుపుతామనే పిల్లలను ఓ కంట కనిపెట్టుకోవాలి. ఆ బాధ్యత తల్లితండ్రులదే. సెలవు రోజుల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతుంటారు. అలా కాకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. జిల్లాలో రెండు లక్షల 52 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వచ్చేనెల 11 వరకు సెలవులు కొనసాగనున్నాయి.

నీరు.. కన్నీరు..

వానలు పడతుండటంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కుంటలు, చెరువుల్లో నీరు కనిపిస్తోంది. పిల్లలు సెలవు రోజుల్లో ఈత కోసం సరదాగా నీటి వద్దకు వెళుతుంటారు. ఈత వచ్చిన వారితోపాటు ఈత రానివారు కూడా సరదాగా దిగి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. అందుకే ఈతరాని వారు చెరువులు, కాలువలు వంటి వాటికి దూరంగా ఉండడమే మంచిది.

సెల్‌ఫోన్ వద్దేవద్దు..

చేతిలోకి సెల్‌ఫోన్ వచ్చిందంటే ఎన్ని గంటల అలా గడిచిపోతాయే తెలియదు. అందుకే సెలవు రోజుల్లో పిల్లలు సెలవు రోజుల్లో సెల్‌కు బానిస కాకుండా చూడాలి. సెల్‌ఫోన్ చూస్తే చూడనిలే అని ఏకాంతంగా వదిలివేయరాదు. ఆన్‌లైన్ ఆటలకు, గేమింగ్ యాప్‌లకు దూరంగా ఉంచాలి. పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.

స్నేహితులతో బయటికి పంపిస్తే..

స్నేహితులతో బయటికి పంపిస్తే ఎవరితో వెళుతున్నారు.. ఎక్కడికి వెళుతున్నారో కచ్చితంగా తెలుసుకోవాలి. వర్షాకాలం కావడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారం నిల్వలతోపాటు పిచ్చిమొక్కలు పెరిగివుంటాయి. వాటిలో పాములు, విషపు కీటకాలు పొంచివుంటాయి. ఇవి ప్రాణాలకు ప్రమాదాలు కలిగిస్తాయి.

దొంగలతో జాగ్రత్త...

ఊర్లకు వెళ్లే కుటుంబాలు వారి విలువైన వస్తువులను సురక్షితమైన ప్రదేశాలలో ఉంచుకోవాలి. అదే విధంగా ఊర్లకు వెళ్లే కుటుంబాలు వారు నివసించే ప్రాంతంకు సంబంధించిన మహిళా పోలీసు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసుశాఖ కోరుతోంది.

పాఠాలను నెమరువేసుకోవాలి



ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో పాఠాలను నెమరువేసుకోవాలి. సెలవులను వృథా చేయకుండా క్రమశిక్షణతో మెలగాలన్నారు. గ్రంథాలయాలకు వెళ్లి పత్రికలు, మ్యాగజైన్స్, విజ్ఞాన పుస్తకాలను చదివేలా అలవాటు చేయాలి. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. విద్యార్థులకు ఇచ్చిన రక్తహీనతకు సంబంధించిన మాత్రలను రోజుకు రెండు మింగించే బాధ్యతలను తల్లితండ్రులు తీసుకోవాలి.

– మొగల్ ఖాజా హుసేన్, స్టేట్ రిసోర్స్ పర్సన్, రాజంపేట

జాగ్రత్తలు తప్పనిసరి



సెలవుల్లో విద్యార్థులు, ఊర్లకు వెళ్లే కుటుంబాల వారు అన్ని విషయాల్లో తగిన రీతిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో తల్లితండ్రులు అప్రమత్తంగా ఉండాలి. దసరా సెలవు అనగానే చాలా మంది వారి వారి ఊర్లకు వెళుతుంటారు. అలాంటి వాళ్లు తగిన జాగ్రత్తలు పాటించి వెళ్లాలి. స్థానికంగా ఉన్న మహిళా పోలీసు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

– మోహమ్మద్ అబ్దుల్ జహీర్, ఎస్‌ఐ, నందలూరు

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గాలివీడు : అన్నింటికంటే గొప్పదానం రక్తదానమని, రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని తహసీల్దార్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం దీపా బ్లడ్ బ్యాంక్ సహకారంతో అక్షిత సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌ఐ వెంకటప్రసాద్, వైద్యులు రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డిలు హాజరై మాట్లాడారు. యువత పెద్ద ఎత్తున రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానంతో ఆపదలో ఉన్నవారిని కాపాడిన వారమవుతామని తెలియజేశారు. కార్యక్రమంలో అక్షిత సొసైటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, వీఆర్‌ఓ అల్లాబకాష్, మండల వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్లు తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు



లక్కిరెడ్డిపల్లెలో కవాతు నిర్వహిస్తున్న సీఐ, పోలీసులు

లక్కిరెడ్డిపల్లె : ఎన్నికల వేళ గ్రామాలలో ఎవరైనా గొడవలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించినా ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఐ జీవన్ గంగనాథ బాబు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం, దర్గా, కోర్టు, బస్టాండ్, చింతకుంటవారిపల్లె వరకు స్థానిక ఎస్‌ఐ విష్ణువర్ధన్, స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ అనంతరం ఎక్కడైనా అల్లర్లు సృష్టించడం గాని, గొడవలకు దిగడం గానీ జరిగితే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని తెలియజేశారు. గెలుపు, ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ స్నేహభావంతో మెలగాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ములకలచెరువు: సచివాలయం సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పోలప్ప హెచ్చరించారు. మంగళవారం ఆయన పెద్దపాళ్యం, కదిరినాధునికోట, పాతములకలచెరువు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

చౌడసముద్రంలో పోలీసుల కార్డన్‌సర్చ్

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రంలో పోలీసులు మంగళవారం కార్డర్‌సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం, నాటుసారా విక్రయాలు జరిపే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తిప్పేస్వామి మాట్లాడుతూ... గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం, మద్యం విక్రయాలు నిర్వహిస్తే సమాచారం అందించాలన్నారు. పీటీయం, బి.కొత్తకోట పోలీసులు పాల్గొన్నారు.

సర్వభూపాల వాహనంపై వెంకన్న

మదనపల్లె సిటీ : సర్వభూపాల వాహనంపై మెరిసిన ఆ దేవదేవుడిని కనులారా వీక్షించిన భక్తజనులు పులకించారు. దేవళంవీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.వాహనాన్ని అధిరోహించిన శ్రీవారికి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకులు,పండితుల వేదమంత్రోచ్ఛరణలతో శ్రీవారి వాహనం ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకుని తరించారు.

నృసింహుడి కల్యాణానికి ఆలయం ముస్తాబు



విద్యుద్దీపాల వెలుగుల్లో ఈటమాపురం లక్ష్మీనరసింహుని ఆలయం



ఆలయంలో కొలువుదీరిన స్వామి వారి మూలవిరాట్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ఈటమాపురం పెంచల నరసింహస్వామి కొండపై వెలసివున్న లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం బుధవారం (నేడు) జరగనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, పెద్దగుండాల్ రెడ్డి, ఈటమాపురం శంకర్ రెడ్డిలు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటలకు ఆలయ ట్రస్టు చైర్మన్ తిరుపాల్‌రెడ్డి, పద్మజ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, బంగారు మాంగల్యం, ముత్యాల తలంబ్రాలు, వెండి సామగ్రి సమర్పిస్తారని తెలిపారు. అలాగే చెంచులక్ష్మీకి నాయుడు వారిపల్లి చెంచువారు, తూర్పుపల్లి పురవల్లు చెంచువారు ఆడపడుచు సాంగెం తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల, తిరుపతి బృందం మధుర గాయినీ గాయకులచే అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తారని చెప్పారు. 10 గంటలకు కల్యాణం జరుగుతుందని, అలాగే తూర్పుపల్లి గ్రామస్తులతో సాయంత్రం 7 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. 26వ తేదీన పుష్పగాయం ఉంటుందన్నారు. కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.

భక్తి శ్రద్ధలతో కలశస్థాపన పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దవటం : మండలంలోని జెఎంజె కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామి వారికి కలశస్థాపన పూజలు వైభవంగా నిర్వహించినట్లు వేద పండితులు బ్రహ్మశ్రీ నైషదం ప్రతాప్ శర్మ, నైషదం రెడ్డి శర్మల తెలిపారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, తీర్థప్రసాదాలు వితరణలు గావించారు. సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ, దీక్షా హోమం, నవగ్రమ జపం తదితర పూజా కార్యక్రమాలను చేసినట్లు వారు పేర్కొన్నారు. యజ్ఞం, హోమం పూజలకు నరశింగాళ్ల సునీల్ కుమార్ కామాక్షి దంపతులు, వారి కుమారులు సాయిహర్షిక్ కుమార్, సాయి హర్షిత్ కుమార్‌లు సహకరించారన్నారు. భక్తులు స్వామి వారికి దర్శించుకుని కాయాకర్పూరలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు గొప్ప వరమని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని నవాబుపేట గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు అందజేశారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం సురక్షితమన్నారు. ఐరన్ పోలిక్‌యాసిడ్ మాత్రలు, గ్లూకోస్, కాల్షియం, అల్‌బెండజోల్ మాత్రలు ఆసుపత్రిలో ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాలు వయస్సు దాటిన వారికి బీపీ, షుగర్ వ్యాధులుకు రక్త పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, సాధారణ చికిత్సలు అందించినట్లు డాక్టర్ తెలిపారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, 104 సిబ్బంది శివప్రసాద్‌బాబు, భాగ్యమ్మ, రోజా, రమేష్, బాబు, అనంతరాణి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే కో–ఆర్డినేటర్ పాండురంగ

కలికిరి: పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై క్షేత్ర స్థాయిలో అవగాహన అవసరమని కేవీకే కో–ఆర్డినేటర్ డా. పాండురంగ అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కేవీకే ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడి పొందవచ్చని, ఈ మేరకు వ్యవసాయ విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.విజయలక్ష్మీ, కలికిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, కేవీకే శాస్త్రవేత్తలు పీరూసాహెబ్, పీవీ గీత, మాధూరి, సోమశేఖర్ బాబు, ఆర్బీకేల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పీలేరు రూరల్ : పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చునని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర మాధురి అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకు పీలేరు మండలం వేపులబైలు గ్రామంలో క్షేత్ర స్థాయిలో వ్యవసాయం సాగు పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయానికి ఉన్న వనరులు ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. వ్యవసాయ మెళకువలను రైతులు అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి మండల అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం సాయంత్రం నాడు – నేడు, తాగునీరు, హౌసింగ్‌పై మండల ప్రత్యేకాధికారి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నాడు – నేడు పనులు, హౌసింగ్ నిర్మాణలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య, గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు



గండిమడుగుకు చేరుకున్న శ్రీ కాలభైరవుడి (విగ్రహం) మహోత్సవం

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలో గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి తిరునాల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలలో భాగంగా మొదటి రోజు మంగళవారం గాలివీడు సమీపంలోని వెలిగల్లు డ్యామ్ దగ్గర ఉన్న గండిమడుగులో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. యువకులు ఉపవాస దీక్షతో స్వామి వారిని తలపై పెట్టుకొని తీసుకెళ్లి పూజలు నిర్వహించి తరువాత ఆలయానికి తీసుకొచ్చారు. అంతకు ముందుగా స్వామి వారిని పల్లకీలో ఉంచి గ్రామ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారికి భక్తులు వరపడి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి నరసింహస్వామి జయంత్యుత్సవాలు



పూజలందుకున్న లక్ష్మీనారసింహుడు

రామాపురం : ప్రతి ఏటా వైశాఖ శుద్ధ చతుర్దశి రోజున లక్ష్మీనరసింహ స్వామి జయంతి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకుంటారు. మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి వారికి, గుట్టమీద కొలువైన మహావిష్ణు ఆలయంలో స్వామి జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయ సంప్రోక్షణ సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, స్వస్తిహవాచనం, పంచామృత, అభిషేకాలతో పూజలు, జపాలు హోమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులు మహావిష్ణు సహస్రనామ పారాయణం, పూజలు, మంగళహారతి రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు, భక్తులు పూజలో పాల్గొంటారు.

కమనీయం.. లక్ష్మీనారసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని జరుపుతున్న వేద పండితులు

లక్కిరెడ్డిపల్లె : కమనీయం, రమణీయం మర్రిచెట్టు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం. భక్తుల కోలాహలం నడుమ శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దండేవాండ్లపల్లె నుంచి ఉత్సవ విగ్రహాలను బాణసంచా పేలుళ్ల, మేళతాళల నడుమ కుర్నూతుల కృష్ణయ్య కుటుంబ సభ్యులు మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేర్చారు. వేద పండితులతో వెంకటనారాయణ శాస్త్రీ బృందం వారిచే ప్రత్యేక పూజలనంతరం స్వామి వారి, చెంచులక్ష్మీ అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఊరేగింపు మర్రిచెట్టు, రవీందర్ నగర్ కాలనీ, దండేవాండ్లపల్లి, లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలో డీజే, కోలాటం నడుమ నిర్వహించారు. దండే శ్రీరాములు జ్ఞాపకార్థం నిర్వహించిన కోలాటం ప్రజలను, భక్తులను, చూపరులను ఆకట్టుకుంది. రెండువేల మందికి సరిపడా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని లల్లు యాదవ్ ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణ క్రతువుకు సహకరించిన వారికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు